క్లుప్తంగా

ప్రమాదాలకు గురికావొద్దు



బాల్కొండ: చేపల వేటకు వెళ్లినప్పుడు మత్స్యకారులు ప్రమాదాలకు గురి కావొద్దని జిల్లా మత్స్యశాఖ ఏడీ రాజానర్సయ్య అన్నారు. మత్స్యకారుల ప్రాణరక్షణ నైపుణ్యాలపై శిక్షణ, అవగాహన సదస్సును ముప్కాల్‌లోని రైతు వేదికలో బుధవారం నిర్వహించారు. సీనియర్ ఎగ్జిక్యూటీవ్ సభ్యురాలు భార్గవి మత్స్యకారుల ఇన్సురెన్స్‌తోపాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్ఆర్ ఎస్పీలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాన కల్పించారు.

బాధ్యతల స్వీకరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేటలో విధులు నిర్వర్తించిన ఆయన బదిలీపై వచ్చారు. నవనాథ సిద్ధులగుట్ట ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. శివాలయంలో రవికుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్సైకి సన్మానం

రుద్రూర్: రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్సైని సన్మానించిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్, ఉపాధ్యక్షుడు నగేశ్, రుద్రూర్ విండో చైర్మన్ కర్క అశోక్, కిసాన్ ఖేత్ అధ్యక్షుడు అడప సాయిలు, చిక్కడపల్లి అధ్యక్షుడు దువ్వ రవి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

బాల్కొండ: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చిన్నయ్య అన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్లు అందజేత

బాల్కొండ: ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెండోరా మండలం వెల్కటూర్, ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామాల రైతులకు టార్పాలిన్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. రైతులకు 50 శాతం సబ్సిడీ లభిస్తుందని, ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గంగారెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఎంఈవో రాజగంగారాం సన్మానించారు. ఉపాధ్యాయులు జేవీ అనురాధ, సాత్‌పుతే శ్రీనివాస్‌ను వీడీసీ, ఎస్ఎంసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం సరోజగంగారెడ్డి, ఎంపీటీసీ ఉప్పునూతుల అనూష శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల హెచ్ఎం మోహన్, వీడీసీ, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

ఆర్మూర్‌టౌన్: ఉత్తమ తహసీల్దార్‌గా గణతంత్ర వేడుకల్లో ప్రశంసాపత్రం అందుకున్న తహసీల్దార్ శ్రీకాంత్‌ను జిల్లా మీసేవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్, క్లావిన్ రాజు, సుబ్బాని ధర్మాన నాగేశ్వర్, షాహిద్ శ్రావణ్, నప్ప పాల్గొన్నారు.

దాతలకు..

మోర్తాడ్: తిమ్మాపూర్ గ్రామానికి ఫ్రీజర్, వైకుంఠ రథాన్ని వితరణగా ఇచ్చిన గ్రామానికి చెందిన కోరుట్ల ఆర్డీవో సోమరాజేశ్వర్, గడ్డం రాజేశ్వర్‌ను బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, ఉప సర్పంచ్ గాలి నవీన్, వీడీసీ సభ్యులు రాజేందర్, భూపతి, పెద్దారెడ్డి, క్లాం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి..



నందిపేట్ (ఆర్మూర్): ఎమ్మెల్సీగా మహేశ్‌కుమార్‌గౌడ్ శాసనమండలిలో బుధవారం ప్రమాణస్వీకారం చేయగా, కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించారు. లక్ష్మణ్‌గౌడ్, జాకీర్, పట్టణ గౌడ సంఘం సభ్యులతోపాటు షాపూర్‌కు కొమిరే నరేందర్, నీరడి సంతోష్, రాజారెడ్డి, నంగి చిన్నయ్య, కొమిరే చిన్నయ్య, నీరడి భోజన్న తదితరులు హైదరాబాద్ వెళ్లినవారిలో ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- అధికారులు తప్పు చేస్తే చర్యలు తప్పవు
- ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



రెంజల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాధించుకుందామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దూపల్లి, దండిగుట్ట, బోర్గాం, తాడ్‌బిలోలి, రెంజల్, సాటాపూర్ గ్రామాల్లో సుదర్శన్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అధికారులు తప్పులకు అవకాశం లేకుండా సేవ పనిచేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. మొదటి నెలలోనే రెండు పథకాలను అమలు చేశామని, ఫిబ్రవరిలో మరో రెండు పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆచరణ సాధ్యంకాని పనుల జోలికి వెళ్లడం లేదని స్పష్టం చేశారు. రెంజల్‌లోని బందల్ల, మాసపురం రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరించుకుందామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులను వెంటాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెంజల్ గ్రామానికి బోధన్ డిపో నుంచి బస్సులను నడపాలని పలువురు మహిళలు కోరగా, ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.



కాంగ్రెస్‌లో చేరిన సాలూర గ్రామ ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్

ఘనస్వాగతం

ఎన్నికల తరువాత మొదటిసారి వచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. పటాకులు కాలుస్తూ ఎమ్మెల్యే, ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. రైతులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మొబిన్‌ఖాన్, నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, రాములు, మర్ల రమేశ్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, సాయిబాబాగౌడ్, గంగాగౌడ్, గయాస్, సాయారెడ్డి, జావిద్, గంగాకృష్ణ, ఇందిరారెడ్డి, కవిత, లక్ష్మి, నితిన్, చిలుక అశోక్, పోచయ్య, కృష్ణ, ఎంఎల్ రాజు, సాల్మన్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల చేరిక

బోధన్: సాలూర మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సాటాపూర్‌లో ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, మాజీ ఉపసర్పంచ్ డిస్కో సాయిలు, ఎంపీటీసీ కండెల సవిత సంజీవ్‌కుమార్, సొసైటీ డైరెక్టర్లు కన్నె రమేశ్, లింబయ్య, రైతు బంధు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు కన్నె సాయిలు, మైనార్టీ విభాగం గ్రామ అధ్యక్షుడు జాఫర్, ప్రతినిధి రహీమొద్దీన్ ఉన్నారు.

ఆస్పత్రి స్థలాన్ని కాపాడాలని వినతి



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో నవీపేట ఆస్పత్రి సిబ్బంది

నవీపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి స్థలాన్ని కాపాడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ఆస్పత్రి సిబ్బంది కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో స్థలాన్ని కబ్జా చేశారని ఎమ్మెల్యేకు తెలిపారు. అలాగే ఉర్దూ మీడియం పక్కన ఉన్న పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలం కబ్జాకు గురవుతున్నదని, కబ్జాదారులను నిలదీస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మెడికల్ ఆఫీసర్ నవ్య, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటేశ్వర్‌రావు, సూపర్‌వైజర్లు దేవేందర్, కిషన్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



మాట్లాడుతున్న క్షత్రీయ కళాశాల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్

ఆర్మూర్‌టౌన్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని క్షత్రీయ కళాశాల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్ అన్నారు. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలోని క్షత్రీయ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే గెలుపోటములను సమానంగా తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నరేశ్, సెక్రటరీ ఝాన్సీ, మనోజ్‌కుమార్, వెంకటకృష్ణ, దామ సునీల్, దుర్గాదాస్, బాలకృష్ణ, శ్రీరామ, శ్రీకాంత్, విద్యార్థి పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీకి జూనియర్ అసిస్టెంట్ సరెండర్

- తనపై ఎంపీడీవో కక్షగట్టారంటున్న ఉద్యోగి

వర్ని: మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను జిల్లా పరిషత్‌కు సరెండర్ చేసినట్లు ఎంపీడీవో బషీరుద్దీన్ తెలుపగా, తనపై ఎంపీడీవో కక్షగట్టి వేధిస్తున్నారని జూనియర్ అసిస్టెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బుధవారం ఎంపీడీవోను జూనియర్ అసిస్టెంట్ గౌతమ్ నిలదీశారు. విధులకు హాజరవుతున్న తనను నెల రోజులుగా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కొందరు ఉద్యోగులు విధులకు హాజరుకాకున్నా.. మరుసటి రోజు వారితో రిజిస్టర్‌లో సంతకాలు చేయిస్తున్నారని ఆరోపించారు. బుధవారం కార్యాలయానికి వచ్చిన తనను కార్యాలయానికి రావొద్దు.. గెట్‌అవుట్ అని ఎంపీడీవో బెదిరించారని, ఇది ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం వల్లే గౌతమ్‌ను జెడ్పీకి సరెండర్ చేశామని, సీఈవో ఆదేశాల మేరకు రిజిస్టర్‌లో సంతకాలు తీసుకోలేదని ఎంపీడీవో తెలిపారు. ఈ విషయమై జిల్లా పరిషత్ సీఈవో గోవింద్‌నాయక్‌ను వివరణ కోరగా, సమాధానం చెప్పకుండానే ఆయన ఫోన్ కట్ చేశారు.

అందని పాల బిల్లులు

- ఆందోళనలో పాడిరైతులు
- పెండింగ్‌లో మూడు విడతల పేమెంట్



వర్ని పాల సహకార సంఘ భవనం

వర్ని: నెలల తరబడి బిల్లులు అందకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్ని మండల కేంద్రంలోని విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి పాలు పోసే రైతులకు గత నెల 15 రోజులుగా బిల్లులు అందడం లేదు. డిసెంబర్ 16 నుంచి ఇప్పటి వరకు మూడు విడతల బిల్లులు విడుదలకాకపోవడంతో పాడిరైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ 150 మంది పాడిరైతులు సుమారు 1600 లీటర్ల పాలుపోస్తారు. వీటికి సంబంధించి ప్రతి 15 రోజులకోసారి సుమారు రూ.10లక్షల బిల్లులు పాడి రైతులకు అందజేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన రూ.30లక్షల వరకు బిల్లులు విడుదల కావాల్సి ఉంది. అయితే నేటికీ బిల్లులు రాకపోవడంతో పశుపోషణ ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులను అడిగితే రేపుమాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లుల పెండింగ్ వాస్తవమే

పాడి రైతులకు బిల్లులు చెల్లించని విషయం వాస్తవమే. రాష్ట్ర సంఘం నుంచి బిల్లులు రాకపోవడంతో చెల్లించలేకపోతున్నాం. రైతులు పెద్దమొత్తంలో పాలు తీసుకురావడం, సంఘం ద్వారా ఆశించిన స్థాయిలో పాలవిక్రయాలు లేకపోవడంతో బిల్లుల చెల్లింపులో జాప్యమైంది. రైతుల నుంచి ప్రతిరోజూ మూడు లక్షల లీటర్ల పాలు సేకరించాల్సి ఉండగా, నాలుగు లక్షల 50వేల లీటర్ల వరకు సేకరిస్తున్నాం.

– శ్రీనివాస్, సంఘం కార్యదర్శి

అప్పులు చేస్తున్నాం



మూడు విడతలుగా పాల బిల్లులు రాకపోవడంతో అటు పశువుల పోషణ, ఇటు కుటుంబ పోషణ కష్టంగా మారింది. పదిహేను రోజులకోసారి అందాల్సిన బిల్లులు నెల పదిహేను రోజులైనా విడుదలకావడం లేదు. దీంతో పశుగ్రాసం, దాణాకు అప్పులు చేస్తున్నాం.

– రాచప్ప, పాడి రైతు, పాతవర్ని

అధికారులు స్పందించాలి



నెలల తరబడి బిల్లులు చెల్లించకపోతే పశు పోషణ భారమవుతుంది. 15 రోజులకోసారి క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే పశువుల పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు వెంటనే స్పందించాలి.

– కుమ్మరి బాపిరాజు, పాడి రైతు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వేల్పూర్: మండలంలోని కోమన్‌పల్లికి చెందిన గ్రామపంచాయతీ పారిశుద్ధ్యకార్మికుడు దుమాల గంగారాం ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అదజేశారు. బాధిత కుటుంబం పరిస్థితిని స్థానిక నాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన రూ.10వేలు పంపించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దామోదర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు నారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రవీణ్, చరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న నూతుల శ్రీనివాస్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్: రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పసుపు బోర్డు హామీని ఎంపీ అర్వింద్ నెరవేర్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుబంధు, రుణమాఫీ ఊసెత్తడం లేదన్నారు. ఎంపీని విమర్శించే స్థాయి కాంగ్రెస్‌కు లేదన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కార్యదర్శి పులి యుగంధర్, బాసెట్టి రాజ్‌కుమార్, పీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో బంగారు పతకాలు



మాక్లూర్: జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో మండలంలోని దాస్‌నగర్ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభకనబర్చారు. ఆరు విభాగాల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. టెన్నికాయిట్‌లో త్రిష బంగారు పతకం, టేబుల్ టెన్నిస్ సాయిప్రసన్న వెండిపతకం, హైజంప్‌లో సిరంజిత బంగారు పతకం, 300 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో రోజా వెండి పతకాలను సాధించారు. విద్యార్థినులను ప్రిన్సిపల్ లావణ్య, పీడీ వర్షిణి, అధ్యాపకులు బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.

జీపీ పాలకవర్గ సభ్యులకు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్)/రుద్రూర్/మాక్లూర్/బోధన్‌రూరల్/నవీపేట: గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్, మాక్లూర్ మండలం చిక్లి, నవీపేట మండలం కోస్లీ, కమలాపూర్‌లో వీడీసీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో పాలకవర్గాలకు సన్మానం ఏర్పాటు చేశారు. కోటగిరి, బోధన్ మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పరిషత్‌ల సిబ్బంది సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను ఘనంగా సన్మానించారు.

ఎజెండా అంశాలకు ఆమోదం



బోధన్‌టౌన్(బోధన్): మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 28 ఎజెండా అంశాలు ఆమోదం పొందాయి. బోధన్ బల్దియా సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.40 లక్షలు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. సమావేశంలో డీఈ లింగంపల్లి శివానందం, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన



భీమ్‌గల్ : మండలంలోని ధర్మరావుకుంట, రాతం చెరువు, బాబాపూర్ కుంటలను ఆర్డీవో వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు. చెరువులు కబ్జాకు గురవుతున్నట్లు ఫిర్యాదు అందడంతో పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. భీమ్‌గల్‌లోని రాతం చెరువు విస్తీర్ణం 27.72 ఎకరాలు కాగా, పెద్ద మొత్తంలో కబ్జా అయ్యిందని, ధర్మరాయుడు కుంట, బాబాపూర్‌కుంటలనూ ఆక్రమిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. సర్వే నిర్వహించి కంచె ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ ధనుంజయ్, సర్వేయర్ ప్రసాద్ ఉన్నారు.

కరాటేలో ప్రతిభ



రుద్రూర్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపడం అభినందనీయమని కోటగిరి ఎస్సై సందీప్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని వివేకానంద స్కూల్ విద్యార్థులు హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ హన్మంత్‌రావు, కరాటే శిక్షకులు ఖయ్యూం, పల్లవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు బీమా



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామ పంచాయతీ కార్మికులకు సర్పంచ్ సొడ సాయిలత, ఉప సర్పంచ్ సొడ మధువర్మ బుధవారం బీమా చేయించారు. గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు కార్మికులకు రూ.15 లక్షల చొప్పున బీమా చేయించేందుకు రూ.7 వేలను సర్పంచ్ దంపతులు బీమా కంపెనీకి సొంతంగా చెల్లించారు. కార్మికులకు త్వరలో బాండ్లు అందజేస్తామని సర్పంచ్ అన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై కేంద్ర బృందం ఆగ్రహం



ఎడపల్లి (బోధన్): మండలంలోని జానకంపేట గ్రామంలో ఉన్న నాల్గో నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు ఉమేశ్, ప్రతాప్ బుధవారం పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ సావిత్రితో మాట్లాడి పోషణ్ అభియాన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఎదుగుదలలో వ్యత్యాసం ఉండడంతో అంగన్‌వాడీ టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వెంట సీడీపీవో జానకమ్మ, సూపర్‌వైజర్ విజయరాణి తదితరులున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – గుంటూరు కారం (తెలుగు) – 12.30, 7.00, 10.20
నా సామిరంగ (తెలుగు) – 3.50

స్క్రీన్-2 – ఫైటర్ (హిందీ) 3డీ – 11.15, 2.50, 6.25, 10.00

స్క్రీన్-3 – హనుమాన్ (తెలుగు)– 11.20, 2.40, 6.00, 9.20

స్క్రీన్-4 – కెప్టెన్ మిల్లర్ (తెలుగు) – 12.50, 4.00, 10.30
హనుమాన్ (తెలుగు) – 7.10

సంక్షిప్తం

భవన మరమ్మతులకు నిధులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాంలో మహిళ సంఘ భవనం మరమ్మతులకు ఎంపీ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీం నుంచి రూ.4 లక్షల నిధులు మంజూరయ్యాయి. సర్పంచ్ గడ్డం సరోజ, ఉప సర్పంచ్ గడ్డం గంగారెడ్డి పనులను ప్రారంభించారు. మహిళా సంఘం సభ్యులు వారిని సన్మానించారు. మాజీ ఎంపీటీసీ మణిదీపిక యాదగిరి పాల్గొన్నారు.

జీపీ భవనం ప్రారంభం

ఎడపల్లి(బోధన్): మండలంలోని బాపునగర్ నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎంపీటీసీ బిల్లా సుమలత, సర్పంచ్ నావనాత్ సునీత బుధవారం ప్రారంభించారు. పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

బాల్కొండ: మండల కేంద్రంలోని గుట్టల నుంచి అక్రమంగా మొరం తరలింపుపై వార్తలు రాసిన తమను మొరం వ్యాపారి అర్కరి కిషన్ దూషించాడని, వెంటనే అతడిపై కేసు నమోదు చేయాలని ఎస్సై గోపికి విలేకరులు బుధవారం ఫిర్యాదు చేశారు. తమతోపాటు తహసీల్దార్, ఆర్డీవోను బూతులు తిట్టిన ఆడియో తమ వద్ద ఉందన్నారు.

క్షత్రీయలో వర్క్‌షాప్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంలోని క్షత్రీయ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల, పేపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐసీటీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఐసీటీ అకాడమీ తెలంగాణ హెడ్ గోపాల్ గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై సేల్స్‌ఫోర్స్ టెక్నాలజీస్, టూల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే, శిక్షకులు ధీరజ్, సతీశ్, గౌస్‌పాషా పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు స్టాఫ్ నర్సులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ డివిజన్ పరిధిలోని జనరల్ నర్సింగ్ (జీఎన్ఎం) అభ్యర్థులు బుధవారం ఉదయం ఆర్టీసీ బస్సులో బోధన్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి వారికి హైదరాబాద్‌లో ఆర్డర్స్ అందజేశారు. ప్రభుత్వం తరపున ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించగా, తహసీల్దార్ గంగాధర్ హైదరాబాద్‌కు వెళ్తున్న అభ్యర్థులకు అల్పాహారంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించారు.

ఉచిత పశువైద్య శిబిరం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని బజార్‌కొత్తూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువైద్యాధికారి హన్మంత్‌రెడ్డి 42 పశువులకు గర్భకోశ, 17 పశువులకు సాధారణ చికిత్స చేశారు. 49 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. సర్పంచ్ స్కంద పోసాని బాబురాజ్, ఎంపీటీసీ రాజు, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌కు నివాళి

నందిపేట్ (ఆర్మూర్): ప్రగతిశీల సవ్యసాచి కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో పీవైఎల్ నాయకుడు కిరణ్‌కుమార్ 33వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కే గంగాధర్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్‌లో మహిళా సంఘం భవనం వద్ద మరుగుదొడ్ల నిర్మాణ పనులకు సర్పంచ్ కల్పన బుధవారం భూమిపూజ చేశారు. ఉపసర్పంచ్ లింబారెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.